
చిత్ర మాసపత్రిక వారి సంక్రాంతి కథల పోటీల్లో

ద్వితీయ బహుమతి పొందిన కథ!

# హే రామ్ !



**బో**డిగుండు, అద్దాల్లేని కళ్ళజోడు, మెడలో జంధ్యం, చేతిలో కర్రతో 'బాల గాంధీ' నాలుగు రోడ్ల కూడలిలో నిలుచున్నాడు.

ఆపాదమస్తకం సిల్వర్ రంగు పులుముకున్నాడు. కొల్లాయి బదులు నిక్కరు తొడుక్కున్నాడు. పై పంచె ధరించలేదు. కాళ్ళకు చెప్పులు లేవు. పిలక లేదు.

ఒంటి మీద పదేళ్ళుండవు. అయితేనేం అచ్చం గాంధీజీ సిమెంటు విగ్రహంలా కదలిక మెదలక నిలబడ్డాడు రాము.

వాడి ముందో తెల్లగుడ్డ పరిచి ఉంది. దానిమీద 'చిల్లర'గా రాలిన పుణ్యం.

దారినపోయే జనం ఆసక్తిగా చూస్తున్నారు. కొందరు మెచ్చుకుంటున్నారు. మరికొందరు జాలి పడుతున్నారు. ఇంకొందరు చిర్రుబుర్రు లాడు తున్నారు.

వాతావరణం చల్లగా ఉంది. శీతగాలులు వీస్తున్నాయి. ఎండలో వేడిమి లేదు. పాదాలు జివ్వుమంటున్నాయి. చిత్రం! అవేమీ వాడి సంకల్ప బలాన్ని సడలించ లేకున్నాయి.

టాక్సీలో వెళుతున్న విదేశీయులు ఆ దృశ్యం చూసారు.

"గాంధీ" అంటూ అరిచారు. కారుని వెనక్కి తిప్పించారు. రాముని ఫోటోలు తీసారు. వాడి ప్రక్కన నిలబడి ఫోటోలు దిగారు.

"రెప్లికా ఆఫ్ గాంధీ"

"రియల్లీ ఫెంటాస్టిక్ ఫీట్"

మెచ్చుకున్నారు. నోట్లు వేసి వెళ్ళారు.

అది గల్లీ లీడర్ చూసాడు. "వెధవా! గాంధీ వేషం వేసుకుని అడుక్కుంటావా ? ఫారనర్స్ ఏమనుకుంటారు? మనల్ని అడుక్కునే వాళ్ళనుకోరూ? మా పార్టీ మీ కోసం ఎన్నెన్నో పథకాలు పెట్టి ఉద్ధరిస్తోంటే ఇదేం పనిరా మాదచ్చోద్..."

తిట్ల దండకం చదివాడు.

రాము కదల్లేదు. విననట్టే ఉండిపోయాడు.

"నీకు చెవుడేంట్రా..." చెయ్యెత్తి కొట్టడానికి మీది కెళ్ళాడు.

కొందరు కుర్రాళ్ళు అటుగా రావటం చూసాడు. చెయ్యిదించి "రేపు మళ్ళీ ఇక్కడికొచ్చావో నీ పని పట్టేస్తాను" తగ్గు స్వరంతో హెచ్చరించి జారుకున్నాడు.

ఇద్దరు ఆడా, నలుగురు మగా యువతీ యువకులొచ్చారు.

"చాలా క్యూట్‌గా ఉన్నాడు కదూ" ఒకమ్మాయి అంది.

"బోడిగుండు చూసి కొత్త ఫ్యాషన్ అనుకుంటున్నావా! అది గాంధీ స్టైల్" ఒకడు నవ్వాడు.

"మనది మున్నాభాయ్ స్టైల్!" కాలరెగరేసి సంజయ్‌దత్‌లా నిలబడ్డాడు ఇంకొకడు.

"సీ.. సీ.. కుర్రాడు అస్సలు కదలటం లేదు. గ్రేట్ యార్" అచ్చెరువొందింది ఇంకో అమ్మాయి.

"ఈ సోకు ఎంత సేపో నువ్వే చూడు" జేబులోంచి ఫైవ్‌స్టార్ చాక్లెట్ బార్ తీసి రాముకి చూపించాడు.

చూడనట్టే ఉండిపోయాడు రాము.

"ఫైవ్‌సార్ట్ చాక్లెట్‌రా! చాలా బావుంటుంది. నీ జన్మలో తినుండవ్! తీసుకోరా..." రాములో కదలిక లేదు.

ఆ యువకుడిలో పట్టుదల పెరిగింది. దగ్గర్లో ఉన్న పచ్చి మిరప కాయ బజ్జీల బండి దగ్గరికెళ్ళి నాలుగు బజ్జీలు కొనుక్కొచ్చాడు.

"వీటి వాసన తగిలితే చాలు ముక్కు మూసుకున్న ఋషి నోట్లోనైనా సరే లాలాజలం ఊరి కారి తీర్సాలిందే" అంటూ వాటిని రాము ముఖం ముందు పెట్టాడు.

ఊహు... రాము వాటి వంక చూడలేదు.

కసిగా బజ్జీల్ని కొరికి తింటూ, 'ఆహ్! ఓహ్!' అంటూ అభినయించాడు.

అమ్మాయిలు అతడి పాట్లు చూసి నవ్వారు.

"కరెక్ట్ మంత్రం నేను వేస్తాను చూడు" అంటూ ఇంకొకడు ముందుకొచ్చి తెల్లగుడ్డ మీది నోట్లు తీసాడు.

కంచంలోని 'కూడు' లాగేసుకుంటున్నట్టు అనుభూతి చెందాడు విలవిల్లాడాడు. అయినా కదల్లేదు రాము.

"వీడి డబ్బుతో వీడి పేరు చెప్పుకుని బజ్జీలు తిందాం పదండి" మరొకడు అన్నాడు ఓర కంట రాముని చూస్తూ.

రాము పెదవి విప్పలేదు. కళ్ళల్లో మాత్రం బాధ కదలాడింది.

"ఏడిపించడానికి మీకు చిన్నపిల్లాడే దొరికాడా" అంటూ నోట్లు లాక్కుని గుడ్డ మీద వేసేసిందో అమ్మాయి.

"వేలెడంత లేదు ఎంత టెక్కో చూడు" ఉక్రోషపడ్డాడు బజ్జీలు తెచ్చినవాడు.

"అదేం కాదులే. అలా విగ్రహంలా నిలబడితేనే కదా నాలుగు
రూపాయ లొచ్చేది" అంటూ రూపాయి నాణెం వేసి వాళ్ళని తీసుకు పోయింది రెండో యువతి.

నాలుగడుగులేసాక మరేమనిపించిందో గాని ఓ యువకుడు వెనక్కొచ్చి జేబులోని చిల్లర వేసి వెళ్ళాడు.

"గుడ్ హ్యూమన్" మెచ్చుకుందో అమ్మాయి.

"చలిపెట్టకుండా మనం జీన్సూ, జెర్కిన్సూ వేసుకున్నాం. పాపం వాడికి చొక్కా అయినా లేదు!"

"ఆ రోజుల్లో దేశంలో సగం జనాభాకి సగం దుస్తులే ఉన్నాయని వారి ప్రతిరూపంగా దరిద్ర నారాయణుడి వేషం వేసుకున్నారు గాంధీజీ. ఇప్పటికీ పరిస్థితి అలాగే ఉందంటే ఎంత షేమ్!" ఒకమ్మాయి వ్యాఖ్యానించింది.

"తేడా లేక పోలేదు. ఆకలీ ఉంది, అభివృద్ధీ ఉంది. ఓ ప్రక్క అంతస్థుల మేడలు పెరుగుతున్నాయి. మరోప్రక్క పూరిగుడిసెలూ ఎక్కువవుతున్నాయి."

"ఆకలి చావులూ, ఆత్మహత్యల విషయంలో మాత్రం అభివృద్ధి గణనీయంగా ఉంది" వ్యంగ్యంగా అన్నాడో యువకుడు.

కొన్ని నిమిషాల క్రితం రాము ముందు పరిచి ఉన్న గుడ్డలోని నోట్లు తీసిన యువకుడికేదో ఆలోచన వచ్చింది. గబగబా వెనుదిరిగి వెళ్ళి "ఒరేయ్! నీ వెనుక బాంబు ఉందిరోయ్" అని అరిచాడు.

ఆ అరుపు విన్న జనం కకావికలుగా పరిగెత్తారు.

అతడి మిత్రబృందమూ దౌడు తీసింది.

ప్రక్కనే కూడలిలో ఉన్న కానిస్టేబుల్ అమాంతం అదృశ్యమై పోయాడు. కాని రాము బెదర్లేదు. అంగుళం కూడా కదల్లేదు.

వాడికి 'బాంబు' మాట కేవలం విన్పించింది. కాని 'అన్నం ముద్ద' కనిపిస్తోంది!

అన్నం! 'అన్నం దేవుడి స్వరూపం' అని చెప్పింది వాడి తల్లి.

అందు నిమిత్తమే తల్లి తనకీ వేషం వేస్తోందని వాడికి తెలుసు.

రోజుకో సెంటర్లో గంటల తరబడి నిలబడితే ఎనభయ్యో, వందో వస్తాయి. మళ్ళీ దానిలో ఇరవై దాకా సిల్వర్ రంగుకే పోతుంది.

ఆ రంగు వేస్తూ రాము అమ్మ దగ్గుతుంది. ముక్కు చీదుతుంది. ఒక్కోసారి ఊపిరి బరువుగా తీస్తుంది. ఆయాస పడుతుంది.

అయినా అన్నం కోసం అన్నీ మౌనంగా భరిస్తోంది. ఆ సంగతి వాడు గ్రహించినందునే కన్నీటిని కనురెప్పల మాటున దాచుకోవడం అలవాటు చేసుకున్నాడు.

సిల్వర్ రంగు కళ్ళకి వేసేటప్పుడు రాము చెల్లెలు "జాగ్రత్తమ్మా" అంటూ గోల చేస్తూంటుంది. కళ్ళకి తగిలితే కళ్ళు పోతాయని దానికెవరో చెప్పారట.

తన కళ్ళకన్నా నాలుగు పొట్టలు ముఖ్యమని పసిదానికి తెలీదనుకున్నాడు రాము.

"అందరిలాగా మాకూ నాన్న ఉంటే మనకీ తిప్పలుండేవి కాదు కదమ్మా! నేను రోజూ బడికెళ్ళి చదువుకునేవాణ్ణి. పెద్దయ్యాక ఉద్యోగం చేసి తమ్ముడ్నీ, చెల్లెల్నీ ఎంచక్కా

చూసుకునేవాడ్ని, ఆకలనేది తెలియనిచ్చే వాడ్నే కాదు” ఒకరోజున అన్నాడు రాము తల్లితో.

పిచ్చిగా చూసింది. కళ్ళల్లో అల భళ్ళున బ్రద్దలైంది.

గోడకి చేరబడి “ఎందుకో దేవుడికి మన మీద కోపం వచ్చింది” అని గొణిగింది.

“దేవుడు కాదు మనుషులే నాన్నని చంపేసారు” ఆవేశపడ్డాడు.

వాడ్నీ బిక్కుబిక్కుమని చూస్తున్న ఇద్దరు పిల్లల్నీ అక్కున చేర్చుకుని బావురుమంది.

రాము తండ్రి తోపుడు బండి మీద రకరకాల బొమ్మలు పెట్టుకుని ఊరంతా తిరిగి అమ్మేవాడు. తల్లి నాలుగిళ్ళలో పాచిపని చేసేది. పరమాన్నాలు లేకపోయినా కలో గంజో తృప్తిగా తినేవారు.

హఠాత్తుగా ఒకరోజున రెండు మతాల వారి మధ్య గొడవలు చెలరేగాయి. కత్తులతో కర్రలతో స్వైర విహారం చేసారు. ఎన్నో దుకాణాలను కాల్చేసారు. ఎందర్నో కూల్చేసారు.

మరెవరు పొట్టన బెట్టుకున్నారో తెలీదుగానీ ఆ అల్లర్లలో రాము తండ్రి ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

దిక్కులేని పక్షులయ్యారు.

పరిహారం ఇస్తామన్నవారు మళ్ళీ కనిపించలేదు.

ఆసరా ఇచ్చేవారే కరువయ్యారు.

బ్రతుకులు రోడ్డెక్కాయి. తల్లి సంపాదన ఆకలి మంటల్ని ఆర్పలేక పోయింది.

అప్పుడు రాముకి వాడి తల్లి గాంధీ వేషం వేసి కూడలిలో నిలబెట్టింది. అన్నం కంటబడింది. వాడి చెల్లీ, తమ్ముళ్ళ కళ్ళల్లో మతాబులు వెలిగాయి. దాంతో అది రాముకి ఓ వృత్తి అయింది.

“ఎప్పుడూ ఈ వేషమే వేస్తావేంటమ్మా?” ఒకసారి తల్లిని అడిగాడు.

“ఇది ఎంతో తేలికరా. ఖర్చులేని వేషం. పైగా గాంధీ తాత అందరికీ ఇష్టం కదా కన్నా...”

“తాత మంచోడు కదా! మరెందుకు చంపారు?”

“అందుకనే చంపారేమో!”

“రాక్షసుల్ని కదా చంపాలి?”

“మంచోళ్ళనీ చంపుతారు. నాన్నని చంపలేదూ?”

“ఇందిరమ్మనీ చంపారంట కదా!”

“రాజీవ్‌గాంధీనీ చంపారన్నయ్యా” చెల్లెలంది.

“అందర్నీ ఎందుకు చంపుతారమ్మా! అలా చంపితే వాళ్ళకేం వస్తుంది?”

“బోల్డు డబ్బొస్తుందేమో!” చెల్లెలంది చేతులు చాపి చూపిస్తూ.

"నువ్వూరుకో. నీకేం తెలీదు" చెల్లెల్ని కసిరి "నువ్వు చెప్పమ్మా" అన్నాడు రాము.

"పెద్దోళ్ళ గొడవలు నాకేం తెలుస్తాయిరా!"

"నువ్వు పెద్దదానివిగా చెప్పమ్మా!"

"మతాలంటారు. జాతులంటారు. మాది గొప్పంటే మాది గొప్పంటారు. మా జోలికొస్తే సహించమంటారు. పిచ్చోళ్ళు కాకపోతే అందరి ఆకలీ ఒకటే, అందరూ పోవాల్సిందే కాటికే అని తెలుసుకోరు"

"మరేమో అమ్మా! చంపినోళ్ళు చచ్చిపోరా?"

"అంతా చావాల్సిందేరా! వెనకా ముందవుతుందంతే!"

"మరెందుకు ఈ చంపటాలూ, నరుక్కోవడాలూ?"

"పిచ్చెక్కి! ఏ జీవినీ చంపకూడదన్నాడ్రా గాంధీ తాత. ముసలాయన మాటలెవరు వింటారు చెప్పు?"

"అలా చెప్పాడా! అయితే గాంధీ తాత గొప్పోడేనమ్మా. నేను రోజూ ఆ వేషమే వేసుకుంటాను."

"వేషం వేసుకుంటే చాలదురా! వేషం ఉన్నంత సేపూ ఆయనలా నిలబడాలి. పిడుగులు పడ్డా బెదర కూడదు. కదలకూడదు. అంత గట్టివాడు గనుకే పిట్టంత మనిషి చెట్టంత దేశం వాళ్ళని తరిమేసాడు."

"ఓ... నేనూ అలాగే ఉంటానమ్మా. నువ్వే చూస్తావుగా!"

అదంతా గుర్తు చేసుకుని నదురూ బెదురూ లేకుండా నిలబడ్డాడు రాము.

చుట్టూ పరికించి చూసాడు.

సమీపంలో జనమెవ్వరూ లేరు.

బాంబంటూ బెదిరించిన కుర్రాడు తన ప్రాక్టికల్ జోక్ ప్రభావం చూసి మొదట బిత్తరపోయాడు. పిమ్మట బెదిరిపోయాడు. పిల్లిలా జారు కున్నాడు.

తన వెనకాల నిజంగా బాంబు ఉందేమో ?

రాము కళ్ళల్లో భయం పాము బుసలు కొట్టింది.

గాంధీ తాత గుర్తొచ్చాడు.

ధైర్యం పెరిగింది. నిర్ణయం బిగిసింది.

అమ్మ బేల మొహం గుర్తొచ్చింది. బడి నుంచి రాగానే ఆకలంటూ గోలచేసే చెల్లెలు గుర్తొచ్చింది.

తన వంక ఆశగా చూసే తమ్ముడూ గుర్తొచ్చాడు.

తెల్లగుడ్డలోని నోట్లూ, నాణేలూ కళ్ళతోనే లెక్కించాడు. యాభై దాకా ఉంటాయి.

ఇంకో యాభై రూపాయలైనా వస్తే బావుణ్ణు!

చెల్లెలేదో పుస్తకమూ, పెన్సిలూ కొనమన్న సంగతి జ్ఞప్తికొచ్చింది. చెల్లెలికి కొంటే తమ్ముడికి చాక్లెట్ అయినా కొనాలి. లేకపోతే బిక్కమొహం పెట్టేస్తాడు.

అమ్మకేదో జబ్బు వచ్చింది. పని చెయ్యలేక పోతోంది. దగ్గూ, ఆయాసం ఎక్కువయ్యాయి. రాత్రుళ్ళు నిద్ర పోవటమే లేదు. ఎలాగోలా నాలుగు డబ్బులు కూడ బెట్టి అమ్మని ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. ఏం జబ్బో ఏమో!

ఎలాగోలా నయం చేయించాలి. ఇంట్లో తనే పెద్దోడు కదా!

కనుగుడ్ల మీద కన్నీటి తుంపర్లు కురిసాయి. కరిగాయి.

చిన్నగా నిట్టూర్చాడు రాము.

పోలీస్ పెట్రోలింగ్ జీపు వచ్చింది. సెంటర్లో వాకబు చేసి అటూ ఇటూ తిరిగి హడావుడిగా వెళ్ళిపోయారు.

"హమ్మయ్య" అనుకున్నాడు.

ఉత్తుత్తి బాంబేనన్నమాట.

లేకపోతే ఈపాటికి పేలేదే!

పేలి ఉంటే? అమ్మో! తనకేమైనా అయితే అమ్మ తట్టుకోగలదా? తమ్ముడూ, చెల్లీ ఆకలితో మాడిపోరూ!

ఊహు... అలా జరగకూడదు.

'దేవుడూ గాంధీతాతా! మమ్మల్ని చల్లగా చూడండి!'

పసి మనస్సు మూగగా ప్రార్థించింది.

"అమ్మా గాంధీ తాత!" తల్లి చేయి పట్టుకుని నడుస్తున్న ఓ పిల్ల అరిచింది.

"గాంధీ తాత కాదు. తాతలాగా ఎవడో కుర్రాడు వేషం వేసు కున్నాడు. కూటికోసం కోటి వేషాలు!"

అయినా ఆ పిల్ల ఉత్సుకత, ఉత్సాహం తగ్గలేదు. రాము వంక వెనక్కెనక్కి తిరిగి అభిమానంగా చూస్తూనే ఉంది కన్పించినంత దాకా!

రాముకి చెల్లెలు గుర్తొచ్చింది. తనంటే చెల్లికి ఎంత ప్రేమో. తనమీద ఈగని కూడా వాలనివ్వదు.

"కాళ్ళు లాగుతున్నాయా అన్నయ్యా? నొక్కనా?" అంటుంది. తను వద్దంటాడు.

అయినా కాస్సేపు నొక్కిగాని ఊరుకోదు.

కాళ్ళకి కొబ్బరినూనె మర్దనా చేసి వేడి నీళ్ళు కాపడం పెడుతుంది అమ్మ.

చిట్టి తమ్ముడు ఇంతింత కళ్ళు చేసుకుని చూస్తూంటాడు.

వాళ్ళందరికి తనంటే ఎంత ఇష్టమో!

రోజూ ఇలాగే – వీలైతే ఇంకా ఎక్కువగా కష్టపడాలి. చెల్లెల్నీ, తమ్ముడ్నీ బాగా చదివించాలి.

ఓ స్కూటరొచ్చి వాడి ముందాగటంతో వాడి ఆలోచనా మాలిక తెగిపోయింది.

అతడు అర్ధ రూపాయి వేస్తే బావుణ్ణని ఆశగా చూసాడు.

కాని స్కూటరతను రాముని పట్టించుకోలేదు. దేని గురించో ఆత్రంగా కలయజూస్తున్నాడు.

అతడి కాళ్ళ దగ్గర క్యారేజీ ఉంది. బహుశా అందులో అన్నం ఉండి ఉంటుంది. చెల్లెలికో తమ్ముడికో అన్నం పట్టుకెళ్తున్నాడు కాబోలు. త్వరత్వరగా వెళ్ళి వాళ్ళకి అందివ్వాలని, వాళ్ళు ఆబగా తింటుంటే ఆనందంగా చూడాలని తొందరపడుతున్నట్టున్నాడు.

పాపం! వాళ్ళూ ఇతడు తెచ్చే అన్నం కోసం ఎంతగా ఎదురుచూస్తున్నారో!

తను ఇంటికెళ్ళడం కాస్త ఆలస్యమైతే చాలు చెల్లీ, తమ్ముడూ ఆకలి చూపులతో గుమ్మానికి అతుక్కుపోతారు.

అమ్మ ఆందోళన పడుతూ కల తిరుగుతూంటుంది.

తను కంటబడేసరికి అమ్మ గుండెలు కుదుట పడతాయి.

చెల్లీ, తమ్ముళ్ళ కళ్ళల్లో మెరుపులు కురుస్తాయి.

ఆకలికీ, అన్నానికీ కులమూ మతమూ ఉండవంటుంది అమ్మ. అందుకే అంతా ఒకటేనని చెప్పడానికే దేవుడు వాటిని సృష్టించాడేమో!

చౌరాస్తాలో గ్రీన్ లైట్ వెలిగింది.

ఉధృతిగా వాహనాలు ప్రవహిస్తున్నాయి.

స్కూటరతనూ వేగంగా వెళ్ళి వాళ్ళతో కలిసాడు.

కళ్ళతోనే 'బై.. బై' చెప్పాడు రాము.

అతడి స్కూటర్ మీది క్యారేజ్ రోడ్డు మీద పడిపోయింది. ఉలిక్కి పడ్డాడు రాము. స్కూటరతను గమనించనే లేదు.

కడుపులో చెయ్యిపెట్టి దేవినట్టన్పించింది. "అన్నయ్యా! ఆకలి!" అంటున్న చిన్నారుల మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి.

మరేమీ ఆలోచించలేదు. నారి సంధించి వదిలిన బాణంలా దూసుకెళ్ళాడు రాము. క్యారేజి అందుకుని "అన్నా! క్యారేజీ! అన్నా.. అన్నా.. అన్నం!" అరుస్తూ పరుగెట్టాడు.

హఠాత్తుగా అన్నం క్యారేజీ భయానక శబ్ధం చేస్తూ విస్ఫోటించింది.

"అ... మ్మా...!"

ఒక ఆర్తనాదం ప్రతిధ్వనించింది.

సరిగ్గా అప్పుడే రాముకి అన్నం తెస్తోన్న అతడి తల్లి కన్నపేగు కదిలింది.

ఏదో తెలీని భయం కుదిపెయ్యగా క్రూరమృగ గాండ్రింపుకు బెదిరిన లేడిపిల్లలా నలువైపులా చూసింది.

జనం పరుగులు పెడుతూ వస్తున్నారు.

"ఏమయ్యింది బాబూ..."

"బాంబు ... పారిపో!"

ఆమె పారిపోలేదు.

"రామూ...!" అని పిచ్చిగా అరుస్తూ కూడలివైపు పరుగెట్టింది.

ఎదురొచ్చిన జనం తోసేశారు. పడిపోయింది. అన్నం నేలపాలయ్యింది. చటుక్కున లేచి ఏడుస్తూ గుండెలు బాదుకుంటూ పరుగెత్తింది.

రాము నిలబడినచోట కర్ర, పరిచిన తెల్లగుడ్డ మాత్రమే ఉన్నాయి.

నిర్మానుష్యమైన రోడ్డు మీద కెళ్ళింది.

కళ్ళజోడు కన్పించింది.

ఇంకా ముందుకెళ్ళింది.

రాము కన్పించలేదు.

చెల్లా చెదురుగా పడి ఉన్న మాంసపు ఖండాలని చూసి కుప్పకూలి పోయింది.

అవి మాంసపు ఖండాలు కాదు. మానవత్వపు ఖండాలు!

హోరున భోరున విలపిస్తున్న ఆ తల్లిపేరు భారతి!!

* * *

**(చిత్ర మాసపత్రిక మార్చి 2010)**

**(కన్నడంలోకి అనువదించబడినది)**